

### వ్యవసాయానికి తక్షణమే విద్యుత్తు సర్వీసుల విడుదల...

# గ్రామీణ ప్రాంతాల్లో 3 ఫేజ్ విద్యుత్

**సేవాలోపంతోనే బిహెచ్ఇఎల్ టెండర్లను పరిగణలోకి తీసుకోలేదు : ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు వెల్లడి**

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిల ఆదేశాలకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడంతోపాటు రైతులు అడిగిన వెంటనే విద్యుత్ సర్వీసులను విడుదల చేస్తున్నామని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు తెలిపారు. స్థానిక ఎపిఎస్ పిడిసిఎల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఎండి సంతోషరావు మాట్లాడారు. గతంలో యేడాదికోసారి కోటా మేరకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేసే పద్ధతి అమల్లో వుండేదన్నారు. అయితే ప్రస్తుతం రైతుల శ్రేయస్సు దష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి పెద్దిరెడ్డి నిర్ణయం మేరకు తక్షణమే సర్వీసులను విడుదల చేస్తున్నామని తెలిపారు. 2019 నుంచి 2023 వరకు (ప్రస్తుతం వరకు) మొత్తం 2.34లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేశామన్నారు. ప్రస్తుతం కేవలం 7,129 సర్వీసుల విడుదల మాత్రం పెండింగ్ వుందన్నారు. రైతుల సమస్యలపై తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్డిఎస్ఎస్) కింద సంస్థ పరిధిలోని 3,900 ఫీడర్లను వేరు చేస్తున్నామన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతరాయంగా 3 ఫేజ్ విద్యుత్తును సరఫరా చేయడానికి అవకాశం వుంటుందన్నారు. ఆర్డిఎస్ఎస్ పథకం కింద చేపట్టే పనులకు కేంద్ర ప్రభుత్వం 60శాతం గ్రాంటును మంజూరు చేస్తుందని, మిగిలిన 40శాతం వ్యయాన్ని మాత్రమే సంస్థ భరించాల్సి వుంటుందని వివరించారు.ఈ పథకానికి సంబంధించిన పనులు 2026లోగా పూర్తి చేయాల్సి వుందని తెలిపారు.

**సేవా లోపం కారణంగా బిహెచ్ఇఎల్ టెండర్లను పరిగణలోకి తీసుకోలేదు**

ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో వివిధ పరికరాల కొనుగోలు కోసం గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్ (జెమ్) పోర్టల్ ద్వారా టెండర్లను ఆహ్వానించం జరుగుతోందని సిఎం కె.సంతోష రావు చెప్పారు. విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్డిఎస్ఎస్) కింద 2807 11కెవి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి

విసిబిల సరఫరా కోసం జూన్-2023లోటెండర్లను ఆహ్వానించామని తెలిపారు. ఆ టెండర్లలో భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఐఎల్) హైదరాబాద్, స్టెల్మెక్ లిమిటెడ్ ముంబయి, మెగావిన్ స్విచ్ గేర్ ప్రైవేట్ లిమిటెడ్ సేలం సంస్థలు పాల్గొన్నాయని, వీటిలో స్టెల్మెక్ లిమిటెడ్ ముంబయి,మెగావిన్ స్విర్ ప్రైవేట్ లిమిటెడ్ సేలం సంస్థలు సాంకేతిక అర్హత సాధించాయని తెలియజేశారు. సాంకేతికంగా అర్హత సాధించడం కోసం విసిబిల పరిమాణం, పనితీరుకు సంబంధించిన ధవపత్రాలను బిహెచ్ఐఎల్ పొందుపరచలేదని దీంతో బిహెచ్ఐఎల్ సాంకేతికపరమైన అర్హతను సాధించలేదన్నారు. టెండర్ల ప్రక్రియలో భాగంగా అంతిమంగా ధరను నిర్ణయించే సందర్భంలో సాంకేతిక ప్రమాణాలను పరిగణలోకి తీసుకుంటామని,నిర్దిష్టమైన ధర ఖరారు కాకపోతే టెండర్లను రద్దు చేస్తామని తెలిపారు.

**ప్రతిపాదనల దశలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల మార్పిడి ప్రక్రియ**

ఎపిఎస్ పిడిసిఎల్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను మార్పిడి చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతి పాదనలను పంపించినట్లు సిఎండి సంతోష రావు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, బ్రేకర్ల జీవితకాలాన్ని 25 యేళ్ళుగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) మార్గదర్శకాల్లో పేర్కొందని వివరించారు. వినియోగం సమయం పెరిగేకొద్దీ ట్రాన్స్ఫార్మర్ కోర్ సాచురేషన్, వైండింగ్ ఇన్సులేషన్ డ్యామేజ్, ఆయిల్ నాణ్యత లోపించడం కారణంగా ట్రాన్స్ఫార్మర్లో నష్టాలు పెరుగుతాయన్నారు. ఒక్క యూనిట్ నష్టానికి సుమారు రూ. 8లచొప్పున నష్టం వాటిల్లుతుందని, తద్వారా సంస్థకు ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలను బలోపేతం చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకాన్ని (ఆర్డిఎస్ఎస్) అమలు చేస్తోందని, ఈ పథకానికి సంబంధించిన పనులను విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణీత సమయంలో పూర్తి చేస్తేనే కేంద్ర ప్రభుత్వ గ్రాంటు లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే రెండవ దశ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అనుమతి కోసం పంపించామని, ఈ పథకంలో మొదటి దశ పనులకు సంబంధించి రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్సి) అమోదం తీసుకున్నామన్నారు. ఎపిఎస్పిడిసిఎల్లో అన్ని పరికరాల కొనుగోలుకు సంబంధించి టెండర్లు ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా జరుగుతాయని, రివర్స్ టెండరింగ్తోపాటు టెండరు ప్రక్రియ పారదర్శకంగా వుంటుందన్నారు. ఇందులో ఏ ఉత్పత్తిదారు అయిననూ పాల్గొని, టెండరు బిడ్ పత్రంలోని అర్హతల ప్రకారం క్వాలిఫై అయిన సంస్థలకు పనులను అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నంబరు 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందని వివరించారు.

### వీవోఏ సమస్యల పరిష్కారంకై 36 గంటల ధర్నా

## పట్టించుకోకుంటే మరిన్ని పోరాటాలు

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి**

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్**

రాష్ట్ర ప్రభుత్వం వీవోఏల పట్ల అనుసరిస్తున్న వైఖరి అన్యాయంగాను, అధర్మంగానూ ఉందని న్యాయమైన వారి సమస్యలను పరిష్కారించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న 36 గంటల ధర్నాను ఉద్దేశించి కందారపు మురళి మాట్లాడారు. మూడు సంవత్సరాల కాలపరిమితితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సర్క్యులర్ను రద్దు చేయాలని, జీతాలు పెంచాలని, గ్రూపుల విలీనాన్ని మానుకోవాలని, ఇన్సూరెన్స్ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉదయం నుంచి నిరంతరంగా ధర్నా చేస్తున్న వీవోఏలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో సంఘమిత్ర లుగా, వెలుగు యానిమేటర్లుగా పనిచేసిన వివోఏలు మానసిక సంఘర్షణకు గురవుతున్నారని, చాలీచాలని వేతనాలతో అల్లాడిపోతున్న నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట 36 గంటల ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వివోఏల పట్ల అనుసరిస్తున్న ధోరణి అన్యాయంగా ఉందని, చాలీచాలని వేతనాలు ఇస్తూ రోజంతా పనులు చేయించు కుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేలకు లక్షలలో జీతాలు, కుటుంబం కోసం వత్తిని నమ్ముకుని పనిచేస్తున్న వివోఏలకు చాలీచాలని జీతాలు ఇదెక్కడి దారుణమని ఆయన విమర్శించారు. తక్కువ వేతనాలు ఇస్తూ ప్రభుత్వ పథకాలకు అర్హులు కారంటూ దూరం పెట్టడం ఎంతవరకు సమంజసమా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్న నాయకులకు వారి పనుల నిర్వహణకు వివోఏలు మొదట గుర్తొస్తారని, లక్షల మందితో సభలు నిర్వహించడానికి వివోఏలు అవసరమని, వారి జీవితాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు మాత్రం పట్టించుకోవడంలేదని దీన్ని సిఐటియు తీవ్రంగా పరిగణిస్తున్నదని అన్నారు. విఓఏల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం వివోఏలు కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కార్యదర్శి గురవయ్య, వేణుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివోఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, లక్ష్మి, వేణు, రామయ్య, చాముండేశ్వరి, రాజేశ్వరి, భారతి, షాహిదా, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్నతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

## రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయండి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపు**

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

**ప్రజాశక్తి- క్యాంపస్ :** సంక్షేమ సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ విధానాలు మారాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో కొర్లగుంట జంక్షన్లో ఉన్న టిఎంఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించడం జరుగుతున్నది సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపు నిచ్చారు. దీనికి ముఖ్య అతిథిగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, దావాలే, డి.రమాదేవి, మూలం రమేష్, కే.సుబ్బారావుమ్మ, కే.ధనలక్ష్మి రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు హాజరు అవుతున్నారన్నారు. ఈ సదస్సుకు డాక్టర్ పి.సాయి లక్ష్మి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా సుందరయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నందు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆకలి, అవిద్య, అసమానతలు, వేధింపులు, అత్యాచారాలు, ఉపాధి హామీ, ఉపాధి లేమి, ఘనమైన వేతనాలు పెరుగుతున్న భారాలు కష్టాలు కన్నీళ్ళకు అతిలేని వివరా నేపథ్యంలో జరుగుతున్న రాష్ట్ర సదస్సు దీన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహిళలను హింసను పెట్రాగిచ్చే విధంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన మద్యం పైన వచ్చే ఆదాయాన్ని ఏటేటా పెంచుకుంటూ మధ్యాహ్నం నిషేధించే దాన్ని నీరు చేర్చడం జరుగుతుందన్నారు. మద్యం వల్ల మత్తుమందులతో పోర్న్ సైట్స్ ప్రభావంతో మహిళల పైన నేరాలు సురీతంగా పెరిగిపోతున్నాయన్నారు. మహిళల సమానత్వ సాధన కోసం ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు రాష్ట్రంలో మహిళా ఉద్యమాలను సిపిఎం బలపరుస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేస్తుందన్నారు.సిపిఎం జిల్లా నాయకులు డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఎం.జయంతి, ఎస్.జయచంద్ర, బాలసుబ్రమణ్యం, మాధవ కష్ణ, నరేంద్ర, సోమశేఖర్, మల్లికార్జున, పి.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు పై నుండి పడి టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగి మృతి

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** టీటీడీ తిరుపతి గోశాలలో చెట్టుపై నుంచి పడి కాంట్రాక్టు ఉద్యోగం మతి చెందిన ఘటన బుధవారం చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రగిరి మండలం తొండవాడ భజన గుడి ఎదురుగా నివాసముంటున్న కే.నందకుమార్ టిటిడి గోశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగ పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం గోశాలలో ఉన్న ఎలక చెట్టు కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కొమ్మ విరిగి కింద పడి తలకు గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. తోటి ఉద్యోగులు వెంటనే స్పందించి గాయపడ్డ నందకుమార్ రుయా ఆసుపత్రి తరలించే లోపే మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోస్టా కాఫీకి పెరుగుతున్న ఆదరణ

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** ప్రముఖ వాణిజ్య పానీయాల కంపెనీ కోకా-కోలా కాఫీ బ్రాండ్కు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ఆ సంస్థ జిఎం వినయ్ నాయర్ తెలిపారు. ఆ కంపెనీ నూతన బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోస్టా కాఫీ 2005లో భారత మార్కెట్లోకి ప్రవేశించి, న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్లో తన ప్రారంభ కేఫ్ను ప్రారంభించిందన్నారు. గత సంవత్సరం కోస్టా కాఫీ భారతదేశంలో తన ప్రయాణాన్ని ప్రారంభించి, సుమారు 60 స్టోర్లను ఏర్పాటు చేసిందన్నారు. కోస్టా కాఫీ దేశంలోని టాప్ 8-10 నగరాల్లో కొత్త స్టోర్లను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. విమానాశ్రయాలు, హైవేలు, ఆరోగ్య సంరక్షణలో ప్రత్యేక ఛానెల్లను ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా, కాఫీ ప్రియుల మన్ననలను పొందుతూ తమ మార్కెట్ను మరింత విస్తరింప చేస్తామని వెల్లడించారు. తమ ప్రయత్నాన్ని వినియోగదారులు ఆదరించాలని కోరారు. సంస్థ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి రైతులకు వెన్నుదన్నుగా మిల్క్ సొసైటీ

**సేవలు మరింత విస్తరణ : చైర్మన్ మధుసూదన్ రావు**

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ది కాళహస్తి కో-ఆపరేటివ్ పాల సరఫరా సంఘం పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆ సొసైటీ చైర్మన్ మునగాల మధుసూదన్ రావు అన్నారు. పాడి రైతులకు మరింత అండగా నిలిచేలా సేవలను విస్తరించనున్నామని భరోసా ఇచ్చారు. పాలసరఫరా సంఘం నూతన పాలకవర్గం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తయిన సందర్భంగా స్థానిక సంఘం సొసైటీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాడి రైతులు, పట్టణ ప్రజల ప్రయోజనార్థం 1952లో పాలసరఫరా సంఘం ఏర్పడిందన్నారు. మాధవరావు, వసంత రావులు ఆద్యులుగా సంఘానికి ప్రాణం పోశారనీ, లాభాల్లో నిలపారని కొనియాడారు. వారి వారసులుగా నేటితరం పాలక మండళ్ళు పాడి రైతులకు అండగా నిలబడుతుండటం హర్షణీయమన్నారు. పాల సరఫరా సంఘం పరిధిలో దాదాపు 20 కిలోమీటర్ల మేర సుమారు 29 గ్రామాల్లో 46 యార్డ్ల గుండా 5400 మంది పాడిరైతుల ద్వారా రోజుకు 9వేల లీటర్ల పాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఇందులో 5వేల లీటర్ల పాలను పట్టణ ప్రజలకు నేరుగా విక్రయిస్తుండగా, 1400 లీటర్ల పాలను వివిధ పాల ఉత్పత్తుల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. మిగిలిన పాలను ప్రయివేట్ డైరీలకు విక్రయిస్తున్నామని చెప్పారు. పాలు, పాల ఉత్పత్తుల ద్వారా రైతులకు వస్తున్న ఆదాయాన్ని పాడి రైతులు, సిబ్బందికే ప్రోత్సాహకాలుగా అందిస్తున్నామని అన్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో పాడి రైతులకు రెండు దఫాలుగా రూ.53లక్షలు, ఉద్యోగులకు రూ.12.37లక్షలు ప్రోత్సాహకాల రూపంలో అందించామని చెప్పారు. పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాకి పన్ను కట్టాల్సి వస్తుందనీ, ఆ ఆదాయాన్ని పాడి రైతులకే ప్రోత్సాహక రూపంలో అందిస్తూ అండగా నిలుస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పాడి రైతులను ప్రోత్సహించేందుకుగాను రూ.21.49 లక్షలు ఖర్చుచేసి బహుమతులు అందించామని వివరించారు. పాడి రైతుకు పాల ధరపై లీటర్కు రూ.3 పెంచామనీ, అదే లీటర్ పాలను రూ.37లకే పట్టణ ప్రజలకు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పాల కేంద్రాలను ఏర్పాటు చేసి పాల ఉత్పత్తులను, పాల సరఫరాను ప్రజలకు అందిస్తామని చెప్పారు. రూ.కోటి నికరాదాయం వచ్చేలా పాలకమండలి ప్రణాళికలు సిద్ధం చేస్తోందనీ, త్వరలోనే లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మీడియా సహకారం, ప్రచారం వల్ల ది కాళహస్తి పాల సరఫరా సంఘం పాల ఉత్పత్తులకు దేశీయంగా, అంతర్జాతీయంగా ఖ్యాతి, డిమాండ్ ఏర్పడిందనీ, భవిష్యత్తులోనూ మీడియా సహకారం ఉండాలని కోరారు. డైరెక్టర్లు హరినాథ్ రెడ్డి, రామయ్య, రామ్మూర్తి, వెంకట్ రెడ్డి, ముని చంద్రా రెడ్డి, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో గృహనిర్మాణాలు వేగవంతం చేయండి: కమిషనర్

గృహ నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న నగర కమిషనర్ హరిత

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** నగరపాలక సంస్థ, గృహ నిర్మాణశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాల పురోగతిపై బుధవారం ఉదయం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో గహ నిర్మాణశాఖ ప్రత్యేక అధికారి రామచంద్రరెడ్డి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. నగరపాలక సంస్థ పరిధిలోని అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించిన ఐదు జగనన్న లేఔట్లలో జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులు కమిషనర్కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక ఇంజినీర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులు సమన్వయం చేసుకుని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు అయిన విద్యుత్, నీటి సరఫరా, రోడ్లు వంటివి కొంతమేర ఏర్పాటు చేసినా అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని అన్నారు. స్టేజిల వారీగా బిల్లుల మంజూరు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని ఇండ్లకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈసమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళిశ్వర్ రెడ్డి, నగరపాలక సంస్థ, గహ నిర్మాణ శాఖ డిఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### 1075 రోజులకు చేరుకున్న

## టిటిడి అటవీ కార్మికుల రిలే దీక్షలు

**చైర్మన్ భూమన స్పందించాలని విజ్ఞప్తి**

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** టీటీడీ అటవీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1075 రోజులకు చేరుకున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. బుధవారం అటవీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన కందారపు మురళి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యాయమైన సమస్యల పరిష్కారంకై పోరాడుతున్న అటవీ కార్మికుల పట్ల టిటిడి యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి సబబుగా లేదని ఆయన విమర్శించారు. 2019వ సంవత్సరంలో టైంస్కేల్ ఇస్తామని బోర్డు తీర్మానం చేసిందని, ఆ తీర్మానాన్ని అమలు చేయకపోగా, కొందరిని పర్మినెంట్ చేసి కొందరిని వీధుల పాలు చేయడం సమంజసం కాదని అన్నారు. తిరుపతి శాసన సభ్యుడుగా, స్థానిక ప్రజల వెతలు తెలిసిన భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్గా సమస్య పరిష్కారంలో జోక్యం చేసుకోవాలని, పేద అటవీ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయమైన సమస్య పరిష్కారానికి మూడేళ్లుగా నిరాహార దీక్షలు చేయడం ధార్మిక సంస్థలో ధర్మమా అని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఇంత దీర్ఘకాలం పాటు సాగుతున్న పోరాటం మరొకటి లేదని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో టిటిడి అటవీ కార్మికుల యూనియన్ నాయకులు సురేష్, సురేంద్ర, కష్ణమూర్తి, కష్ణ, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు...

### జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలలో

## 'శ్రీ పద్మావతి' విద్యార్థినుల ఉత్తమ ప్రతిభ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** హర్యానా రాష్ట్రంలో రోతక్ లోని ఎండి యూనివర్సిటీలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, గ్రాప్లింగ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగిన మూడవ నేషనల్ గ్రా ప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున టిటిడికి చెందిన శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 13 పతకాలు కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి వెల్లడించారు. క్యాడెట్స్ బాలికల విభాగంలో కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఎన్.సుప్రియ, సిఇఎల్ బంగారు పతకం, సిల్వర్, వై.సౌమ్య, సిఇసి బంగారు పతకం, పి.భూమిక, సిఇసి సిల్వర్, జి.అంజలి, ఎమ్ఇసి సిల్వర్, బి.మేఘన-ఎమ్ఇసి, ఎం.నాగగీతిక హెచ్ఈసి, కె.మధులత హెచ్ఈసి, మేఘన సత్య బైపిసి, వై.శిరీష బైపిసి, కె.సుజిత సిఇసి, ఎ.వర్షప్రియ ఎమ్ఈసి, వి.సుస్మిత, హెచ్ఇసి వీరందరూ బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థినులందరినీ ప్రోత్సహించి, టిటిడి యాజమాన్యం కల్పిస్తున్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకొని చదువులో, క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. ఈ పతకాలను సాధించడానికి కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని అభినందించారు.

- విషజ్వరాలు, రోగాల భారిన పడుతున్న గ్రామస్తులు
- కార్పొరేషన్లో విలీనమైన పట్టించుకోని అధికారులు

## శెట్టిపల్లిలో పారిశుధ్యం అధ్వానం

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో శెట్టిపల్లి పంచాయతీ విలీనమైన పెద్దగా తేడా కనబడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వివక్ష పాటించడం వల్లే శెట్టిపల్లిలో అభివృద్ధి పనులు వేగంగా జరగడంలేదని వారు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని ప్రజలు విషజర్వాలకు గురై అసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నా అధికారులు యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని శెట్టిపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా పారిశుధ్యం వల్ల ప్రజలు విషజర్వాల భారినపడి ఇబ్బందులు పడుతున్నా పారిశుధ్య చర్యలు జరగడం లేదని, కనీసం చెత్తచెదరం తొలగించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం కాని, మురుగు కాలువలు శుభ్రం చేయడం

శెట్టిపల్లిలో పేరుకున్న చెత్త

లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయిందని వాటిని తొలగించేనాదుడు కరువైయ్యారని తెలిపారు. ఆర్యోగ అధికారులు కనీసం తొంగిచూడకపోవడంతో ప్రజలు ఆందోళన చేయాలని భావిస్తున్నారు.

తిరుపతి నియోజకవర్గ పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో దాదాపు 3వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. తిరుపతి నగరానికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా రైతులు భూముల శాశ్విత హక్కుల కోసం పోరాడుతూ వస్తున్నారు. కార్పొరేషన్లో విలీనం అయితే రైతుల భూములకు న్యాయం జరుగుతుందని గ్రామంలో అభివద్ధి జరుగుతుందని గ్రామస్తులు భావించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ మరికొంతమంది వార్డ్ మెంబర్లకు కార్పొరేషన్లో విలీనం ప్రక్రియ ఇష్టం లేకపోయినా స్థానిక నాయకుల ప్రోద్భలంతో విలీనం ప్రక్రియ పూర్తయింది. కార్పొరేషన్లో విలీనమై 9 నెలలు అవుతున్న ఇంతవరకు గ్రామం అభివద్ధికి నోచుకోలేదు. పారిశుధ్యం శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో చెత్తాచెదారం మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు విషజ్వరాలు భారిన పడుతున్నారు. అయితే కార్పొరేషన్ అధికారులు మాత్రం శెట్టిపల్లి గ్రామం కార్పొరేషన్ పరిధిలో ఉందన్న విషయం గుర్తుందా లేదో అని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. కార్పొరేషన్ నిధులతో గ్రామంలో రోడ్లు వేశారు. అయితే నాయకులకు అవసరమైన రోడ్లు వేసుకున్నారని జనసంచారం తిరిగే ప్రాంతాలలో రోడ్లు వేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తెలుగుగంగ నీళ్ల కోసం 46 లక్షల నిధులతో పైప్లైన్ నిర్మాణ పనులు చేశారు. ఇప్పటివరకు నీళ్లు రాకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు కార్పొరేషన్ పరిధిలో ఉన్న శెట్టిపల్లి గ్రామంలో పారిశుధ్యం డ్రైనేజీ పనులను పరిశీలించి ప్రజలకు విషజ్వరాల భారిన పడకుండా తగుచర్యలు తీసుకోవాలని తెలుగుగంగ నీరు విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. శెట్టిపల్లి అభివృద్ధికి కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## గొట్టిపాటి హైమావతమ్మకు ఎమ్మెల్యే నివాళి


హైమావతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

**ప్రజాశక్తి-చిట్టమూరు:** మండలంలోని మొలకలపూడి గ్రామ వైసిపి సీనియర్ నాయకులు గొట్టిపాటి రవీందర్ రెడ్డి, శ్రీకాంతి విజయ్, గొట్టిపాటి నాగార్జున రెడ్డి తల్లి హైమావతమ్మ బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాళులు అర్పించారు. హైమావతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కన్నుమూశారు. నెల్లూరు నగరంలోని ఇర్వాన్ సిటీలో హైమావతమ్మ ఉత్తర క్రియలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హైమావతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవీందర్ రెడ్డి నాగార్జున రెడ్డి ల కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట నాయుడుపేట మండల వైసిపి కన్వీనర్ తంబిరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, నాయుడుపేట ఏఎంసి చైర్మన్ తమ్మిరెడ్డి జనార్ధన్ రెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ అనిల్ రెడ్డి నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శ్రీనివాసులు రెడ్డి బలరాం రెడ్డి నాగిరెడ్డి చిట్టమూరు మండల వైసిపి కన్వీనర్ నన్నూరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీపీ వైస్ చైర్మన్ రాజారెడ్డి, జిల్లా వైసీపీ సంయుక్త కార్యదర్శి కామిరెడ్డి కస్తూరిరెడ్డి పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వల్లకొండ సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వల్లకొండ సురేష్ సహకారంతో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి వుంటుందన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, రాము, కోట వెంకటేశ్వర్లు, కుమార్ నాయుడు, వెంకట కృష్ణయ్య, శ్రీనివాసులు, కార్య నిర్వాహకులు కళ్యాణి పాల్గొన్నారు.

## పులివర్తి నాని సతీమణి ఇంటింటి ప్రచారం

పులివర్తి సుధారెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

**ప్రజాశక్తి-యర్రావారిపాలెం:** రానున్న 2024 ఎన్నికల్లో పులివర్తి నానిని ఎమ్మెల్యేగా ఒకసారి గెలిపించి అవకాశం ఇవ్వాలని పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ప్రాధేయపడ్డారు. మీ ఇంటికి మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెరుకు వారిపల్లి పంచాయతీలో పులివర్తి సుధారెడ్డి టిడిపి, జనసేన నాయకులతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే రెండుసార్లు అవకాశం ఇచ్చారని ఒక్కసారి చంద్రగిరి ఎమ్మెల్యే గా అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని పలికారు. సుధారెడ్డిని ఆప్యాయంగా పలకరించి కచ్చితంగా ఓట్లు వేసి నానిని గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. పుట్టావాండ్లపల్లి బుడితేటి వారిపల్లి, సుద్దరాపల్లి, కక్కేవారి పల్లి, గ్రామాలలో బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేస్తూ పల్లెలు అభివృద్ధి చెందాలంటే పులివర్తి నానిని గెలిపించుకోవాలని, అధికార పార్టీ చేసే అవినీతి అక్రమాలు, దోపిడి, రౌడీయిజం, అన్యాయం పై ప్రజలకు వివరించారు. సుధారెడ్డి మండలంలోకి రావడంతో జనసేన, టిడిపి నాయకులు రెట్టింపు ఉత్సాహంతో ఎర్రనీళ్ల దిష్టి తీసి గ్రామంలోకి ఘనంగా ఆహ్వానం పలికారు.

## ఘనంగా వైసీపీ నేత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** వైయస్ రాజశేఖర్ రెడ్డి పై అభిమానంతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్ర నుండి జగన్ వెన్నంటే నడిచిన వైసీపీ నాయకుడు ఊటుకూరు మహేందర్ రెడ్డి అని వైసిపి సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో గూడూరు నియోజక వర్గానికి చెందిన వైసీపీ నాయకుడు గూడూరు జడ్పిటిసి యామిని భర్త ఊటుకూరు మహేందర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ సీనియర్ నేత ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఓదార్పు యాత్ర సందర్భంగా గోగినేని పురంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ సందర్భంగా మొదట నిలిచిన వ్యక్తి మహేందర్ రెడ్డి అని పేర్కొన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహణ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లా శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిపై తప్పడు కేసులు అన్యాయం: మాజీ ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - గూడూరు రూరల్ :** వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవస్థలను మేనేజ్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆరోపించారు. బుధవారం గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి టిడిపి శ్రేణులపై తప్పుడు కేసులు నమోదు చేసి అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా టిడిపిని బలహీనపరచాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేయడం తప్పు అని తెలిపేలా టీడీపీ శ్రేణులు ప్రజాక్షేత్రంలో శుక్రవారం నుంచి ప్రతి ఇంటికి వెళ్లి తెలుపుతారన్నారు. టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, శివకుమార్, పెంచలయ్య నిర్వ హించారు.

## రాష్ట్ర తోబాల్ పోటీలకు పరమేశ్వర మంగళం విద్యార్థి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏకాంబర కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నగరి లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 14 సంవత్సరాల లోపు బాలురు త్రోబాల్ జిల్లాస్థాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరమేశ్వర మంగళం విద్యార్థి పి ఆమోత్తి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోధ్యాయులు చంద్రశేఖర్ శెట్టి మంగళవారం తెలిపారు. త్వరలోనే నంద్యాల కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొం టారని పివి నందకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కమిటీ ఛైర్మన్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

**ప్రజాశక్తి -తొట్టంబేడు:** యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చిలకా వారి కండ్రిగ లో విద్యార్థులకు విద్యాసామాగ్రి వితరణ సంస్థ అధ్యక్షులు హేమ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 6వేలు రూపాయలు విలువచేసే విద్యాసామగ్రిని విద్యార్థిని విద్యార్థులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

## సామూహిక గృహప్రవేశాలు పండుగలా నిర్వహించాలి: కలెక్టర్

గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం నుండి ప్రారంభించనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాలో వడమాల పేట మండలం జగనన్న కాలని కాయం లేఅవుట్ లో సామూహిక గృహ ప్రవేశాలను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె వెంకట రమణ రెడ్డి తెలిపారు.బుధవారం ఉదయం వడమాల పేట మండలం పరిధిలోని కాయం లేఅవుట్ ను కలెక్టర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర రావు తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గృహ ప్రవేశాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేయాలన్నారు. ఇంకా మిగిలిపోయిన గృహ నిర్మాణ పనులు ఏవైనా వుంటే వాటిని సమీక్షించుకుని పూర్తి చేయాలన్నారు. గృహ ప్రవేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులను సూచించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వివరిస్తూ కాయం లేఅవుట్ కు సంబంధించి ఎకరాలు 27.20 సెంట్ల లో ఉందని 780 ఇళ్లు మంజూరు చేశారని, కాయం లేఅవుట్లో పూర్తి అయిన గృహాలకు విద్యుత్, తాగు నీరు కనెక్షన్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ చంద్ర శేఖర్ బాబు, ఏఈ ముత్తు కుమార్ స్వామి, వడమాలపేట తహశీల్దారు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ప్రజలపై భారం మోపే ట్రూ ఆఫ్, కస్టమర్ ఛార్జీలు రద్దు చేయాలి

### వామపక్ష పార్టీలు డిమాండ్

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ప్రజలకు భారంగా మారిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించకపోతే విద్యుత్ ఉద్యమంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని వామపక్ష నాయకులు హెచ్చరించారు. బుధవారం ఉదయం 10 గంటలకి సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాధ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీల పేరుతో జగన్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో అధికారం రాకముందు చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలతో ప్రజలపై భారం మోపుతున్నారని నేను అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్లు ఉచితం ఇస్తానని ప్రకటించారని అధికారంలోకి వచ్చిన తర్వాత అతి తక్కువ కాలంలోనే 11సార్లు పెంచిన చరిత్ర జగన్మోహన్ రెడ్డి దేనిని తెలిపారు. మే నెలలో వచ్చిన బిల్లులు మాత్రమే ఒక్కొక్క ఇంటికి రూ.500లకు పైగా అదనంగా బిల్లు వేసారని దీనివలన ప్రజలపై భారం మోపడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రజలపై భారం మారిన విద్యుత్‌ఛార్జీలను తక్షణమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తగ్గించుకోకపోతే బషీరాబాద్ తరహాలో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను వైసిపి ప్రభుత్వం అత్యంత ఉత్సాహంగా ఒప్పచెప్పారని అత్యంత వేగవంతంగా అమలు చేస్తుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం రైతు మోటార్లకు మీటర్ల బిగించడానికి ఆదానికి ధారాదత్తం చేశారని కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్న రైతుల నుంచి అత్యధికంగా వ్యతిరేకత వస్తున్న తరుణంలో బిజెపి కనుసన్నలలో ఉన్న రాష్ట్రాలలో ఇప్పుడు ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించాలని, ఇది కూడా ఆదాని సంస్థకే ఒప్పజెప్పారని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తనపై ఉన్న కేసుల నుండి బయటపడడానికి అత్యుత్సాహంతో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల భారీ దోపిడీ జరుగుతుందని దీనివలన విద్యుత్ వినియోగదారులపై అధిక భారాలు మోపే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల తక్షణమే తగ్గించాలని స్మార్ట్ మీటర్లను పెట్టే విధానాన్ని వెంటనే విరమించుకోవాలని లేకుంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రజలను చైతన్యవంతం చేసి వైసిపి ప్రభుత్వానికి విద్యుత్ షాక్ తెప్పిస్తామని హెచ్చరించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని విస్తృతంగా ప్రచార కార్యక్రమం చేపట్టి 15వ తేదీన ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తామని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే.రాధాకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శశి కుమార్, నగర కార్యవర్గ సభ్యులు ఎన్.శివ, కేవై రాజా, సిపిఎం నాయకులు వేణు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గసభ్యులు రామిశెట్టి వెంకయ్య, వెంకటరత్నం, సురేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-వరదయ్యపాలెం:** బస్టాండ్ ఆవరణలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ రంగులతో తయారుచేసిన కేక్ కట్ చేసి,తమ అభిమానం చాటుకున్నారు.ఈ కార్యక్రమం లో,రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్ బాబు , జడ్పిటీసీ వెంకటేశ్వర్లు, జె సి ఎస్ కన్వీనర్ వెంకటయ్య (చిన్న), మండల నాయకులు దామోదర్ రెడ్డి,కో ఆప్షన్ మెంబెర్ సిద్దిక్,ఆలీ,ఉప సర్పంచ్ మహేంద్ర, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ లతీఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**క్యాంపస్ :** రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 72వ జన్మదిన సందర్భంగా 72 కేజీల కేక్ ను రుయా హాస్పిటల్ వద్ద కట్ చేసి బుధవారం సంబరాలు జరుపుకున్నారు. పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు చిత్తూరు జిల్లా వైసీపీ కోశాధికారి పుత్తూరు ధనంజయ రెడ్డి త్రీలోక్ నాథ్ రెడ్డి, సూళ్లూరుపేట మునస్వామి రాజు, తిరుపతి రెడ్ ఎఫ్.ఎం(జెమిని టీవీ నెట్ వర్క్) ప్రతినిధి యోగేశ్వర రెడ్డి, బాలాజీ, వెంకటేష్ పాల్గొన్నారు.

**తిరుపతి సిటీ:** రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎస్వియూ పాలకమండలి సభ్యులు మల్లారపు మధు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక రుయా ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద జరిగిన అన్నదానంకు టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ హాజరయ్యారు.

## విద్యార్థినులకు యూనిఫామ్ వితరణ

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ 1 బాలికల విద్యార్థినులు 40 మందికి రెండు జతలు చొప్పున 80 మంది విద్యార్థులకు యూనిఫామ్‌ను సుమారు రూ. 80 వేలు వెచ్చించి లోకా ఫౌండేషన్, వరదయ్య పాలెం లోక ఫౌండేషన్, లోకా దాసాజీ సాయంతో వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వారు గత 20 సంవత్సరాలుగా విద్యార్థులకు చేసిన అనేక సేవలను కొనియాడుతూ విద్యార్థునులు యూనిఫామ్ వితరణ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. లోకా పౌండేషన్ అప్లేటర్ సునీల్ దాషాజీ ప్రసంగించారు.

## నేటి నుంచి వ్యవసాయ భూములు రీ సర్వే : తహశీల్దారు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** ప్రభుత్వ ఆదేశాలు మేరకు. వ్యవసాయ భూములు రీ సర్వే గురువారం నుంచి జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దారు పరమేశ్వర స్వామి పేర్కొన్నారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలోని గొల్లపల్లి రెవెన్యూ గ్రామంను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంచుకొని సదరు రెవెన్యూ గ్రామంలో వ్యవసాయ భూముల రీ సర్వేకు సంబంధించిన సమావేశం గొల్లపల్లి రెవెన్యూ గ్రామంలోని వ్యవసాయ భూమి కలిగిన రైతులతో రామకృష్ణాపురం గ్రామ సచివాలయ భవనంలో పుత్తూరు తహశీల్దారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో రైతులను ఉద్దేశించి తహశీల్దారు మాట్లాడు తూ వ్యవసాయ భూముల రీ సర్వే దాదాపు 100 సంవత్సరాల తర్వాత జరుగుతోందని, గొల్లపల్లి రెవెన్యూ విలేజ్‌లో భూములు కలిగిన రైతులు అందరూభూముల రీ సర్వేకు సహకరించి సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు నైస్ విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-వరదయ్యపాలెం:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి అండర్ 14కరాటే పోటీలకు నైస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి హేమ సుందర్ ఎంపిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మోహన్ విద్యార్థిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 8 నుండి 11,తేది వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విద్యార్థి వంకన్ గటకన్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో విశేష ప్రతిభ కనబరచిన ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. ఇంకా మరెన్నో విజయాలు సాధించి. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి కి ఎంపిక కావాలని విద్యార్థిని కరాటే మాస్టర్ కన్నయ్య ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం కె. దాశరథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## ఇసుక ట్రాక్టర్లు సీజ్

పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్లు, నిందితులు

**ప్రజాశక్తి -పెళ్లకూరు:** పెళ్లకూరు మండలంలోని కలవకూరు వద్ద బుధవారం తెల్లవారు జామున ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఈబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, అడిషనల్ ఎస్పి రాజేంద్ర ఆదేశాల మేరకు పుల్లూరు నుంచి నిరంతరం ఇసుక తరలింపును అడ్డుకోవాలని గస్తీ నిర్వహించి కలవకూరు గ్రామానికి చెందిన దగ్గు మాటి రమేష్, నెలబల్లి శంకరయ్య ఎలాంటి అనుమతులు లేకుండా ఒక్కొక్కరు సుమారు నాలుగు టన్నుల ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా సబ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ ఆర్ యువిఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో వారి వెంట కానిస్టేబుల్ పి వెంకటేశ్వర్లు, రమణయ్య, రాజయ్య, డి వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నా రు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను ఎస్‌సిబి స్టేషన్ కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతుడు వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - ఓజిలి:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో ఉదయం చోటు చేసుకుంది. చిల్లకూరు మండలం పిడతలపూడి గ్రామానికి చెందిన యనమల వెంకటేశ్వర్లు (46) ద్విచక్ర వాహనంపై ఓజిలి నుంచి చిల్లకూరు వైపు వెళుతుండగా రాజుపాలెం జాతీయ రహదారి వద్ద అదే మార్గంలో వెళుతున్న ఏపీ 12 యు 9166 నెంబర్ కలిగిన లారీ వెనుక నుండి ఢీ కొనడంతో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టోల్ ప్లాజా హైవే మొబైల్ అంబులెన్సులో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఓజిలి ఏఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

## అలా పట్టుకున్నారు.. ఇలా వదిలేసారు..!

పట్టుబడ్డ వాహనాల వద్ద కాపలా కాస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి - బాలాయపల్లి :** కంచే చేను మేసిన సంఘటన ఇది..అక్రమంగా తెల్లరాయి కోసం ఇటాచ్, జెసిబి లు మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ గ్రామంలో ప్రభుత్వ, అస్సైన్ మెంట్ భూములలో అధికార పార్టీ నాయకుల అండదండలతో తెల్లరాయి లోడ్‌తో వున్న వాహనాలను రెవెన్యూ శాఖ అధికారులు పట్టుకుని నాయుడు చెరువు గ్రామంలో పోలీసులను, తలారిని రెండు రోజులు కాపలా పెట్టారు. అయితే రెవెన్యూ అధికారుల డబ్బుకు ఆశపడి అదనంగా జరిమానా కంటే ఎక్కువ డబ్బులు తీసుకుని వదిలేశారని సమాచారం. ఈనెల 9 వ తేదీన మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ లో అధికారపార్టీ అండ దండలతో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా తెల్లరాయి తవ్వకాలు జరుపుతుండగా రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి దాడులు చేసి ఇటాచ్ ,జెసిబి లను పట్టుకున్నారు. పట్టుబడిన ఈ వాహనాలపై కేసులు నమోదు చేయకుండా గత రెండు రోజులు గా పోలీసు , రెవెన్యూ శాఖలో పట్టుబడిన వాహనా లకు కాపలా కాశారు. అయితే బుధవారం బేరసారాలు కుదుర్చుకుని వదిలేశారనే అరోపణలు ఉన్నాయి.

## జిఈఆర్ సర్వేని 100 శాతం వేగవంతం చేయాలి: డిఇఓ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** జిఈఆర్ సర్వేని 100 శాతం వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పేర్కొన్నారు. పుత్తూరు విద్యాశాఖ పరిధిలో అందరూ చదవాలని 5 నుంచి 18 సంవత్సరాల వరకు అందరూ చదువుకోవాలని డిఇవో అన్నారు. బుధవారం వైయస్సార్ బిల్డింగ్ లో వెల్ఫేర్ అసిస్టెంట్లు సిఆర్పి లతో డిఇవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వాలంటీర్లు 100 శాతం జిఈఆర్ సర్వే ని పూర్తి చేశారు. ఈ సర్వేలో బడి బయట పిల్లలను గుర్తించారు. వారందరినీ బడిలో చేర్పించాలని ఆదేశించారు. ప్రతి పిల్లవాడు చైల్డ్ ఇన్ఫోలో ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో వెళ్లినవారు , చదువుతున్న వారు మరణించిన వారందరినీ వాలంటీరు యాప్ లో డిలీట్ చేయాలని తెలిపారు. ఈ సర్వే రెండు రోజుల లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంవో సురేష్ , మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి , ఎంపీడీవో ప్రసాద్, ఎంఈఓలు తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం, సీఆర్పీలు ఎంఐఎస్ డేటా సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం రెగ్యులర్ విసిగా ఆచార్య రాణీ సదాశివమూర్తి

రెగ్యులర్ విసిగాబాధ్యతలు చేపడుతున్న సదాశివమూర్తి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం పూర్తిస్థాయి (రెగ్యులర్) ఉప కులపతిగా ప్రొఫెసర్ రాణీ సదాశివ మూర్తిని విశ్వవిద్యాలయ చాన్సులర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నియమించారు. ఈ మేరకు బుధవారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సదాశివ మూర్తి మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ కి ధన్యవాదాలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అవకాశం ఇచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వాహణాధికారి ఏవి ధర్మారెడ్డికి, పాలకమండలి అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి, వారికి కావలసిన సౌకర్యాలు మెరుగుపరుస్తానని తెలిపారు. విశ్వ విద్యాలయ ప్రధాన లక్ష్యాలైన అధ్యయనం, బోధన, ప్రచురణ, పరిశోధన అను అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఏవి రాధేశ్యామ్, అకడమిక్ డీన్ గోళి సుబ్రహ్మణ్య శర్మ, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి, పీఆర్వో డాక్టర్ టి బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుదాం.. ప్రజా సంక్షేమానికి ఉద్యమిస్తాం..

విసికే రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** మతతత్వ శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుతూ, ప్రజాసంక్షేమం కోసం ఉద్యమిస్తామని విడుదల చిరుతయగల్ కచ్చి (విసికె) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే.విద్యాసాగర్ తెలిపారు. వికేసి పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం తిరుపతిలో నిర్వహించారు. స్థానిక డాక్టర్ బాబు జగజీవన్ రామ్ భవన్‌లో జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడంలో వైసీపీ టీడీపీలు రెండు విఫలమయ్యాయని అన్నారు. విభజన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, ఇతర సాధించడంలో పూర్తిగా వైఫల్యం చెంది కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి మోకరిల్లుతున్నారని విమర్శించారు. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపీలు ఉన్న ఈ ప్రాంతానికి ఒరిగింది ఏమీ లేదన్నారు. రాష్ట్రం నుంచి బిజెపికి ఒక ఎంపీ సీటు కూడా ప్రాతినిధ్యం లేకపోయినా వైసిపి టిడిపిలను ఆడిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యంను బతికించేందుకు విసికె పూనుకుందన్నారు. అందులో భాగంగా తమ పార్టీని రాష్ట్రంలో విస్తృత పరుస్తున్నామన్నారు. కేంద్రంలోని ఇండియా కూటమిలో తాము భాగస్వాములమని, కోటమి నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల పోటీ చేస్తామన్నారు. రాష్ట్రంలో పరిస్థితులపై చర్చించి, భవిష్యత్తులో తన పార్టీ చేపట్టబోయే పోరాటాల గురించి ప్రణాళికలు రూపొందించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఇన్చార్జి బాలాసింగం, రాష్ట్ర ఇంచార్జి ఎన్.నీలవన్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు మురళి, రాష్ట్ర కమిటీ నాయకులు వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధుల వినియోగంపై ఉద్యోగ సంఘాల హర్షం

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** తిరుపతి అభివృద్ధికి టీటీడీ తన బడ్జెట్లో ఒక్క శాతం నిధులు కేటాయించడం పట్ల టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫ్రంట్ హర్షం తెలియజేస్తోందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి, టిటిడి బ్యాంకు డైరెక్టర్ కాటా గుణశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు నివాసముంటున్న తిరుపతి నగర అభివద్ధి టిటిడి అభివృద్ధిగానే భావించాలని ఆయన పేర్కొన్నారు. కొందరు పనిగట్టుకొని టీటీడీపై, పాలక మండలి పై చేస్తున్న విమర్శలను ఉద్యోగులు, ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. టిటిడి ఉద్యోగులలో అత్యధికులు స్థానికులని, వారి ముందు తరాల వారి నుంచి తిరుపతి అభివద్ధిలో భాగస్వాములని గుర్తు చేశారు. తిరుపతి నగరంలో అభివృద్ధికర కార్యక్రమాలు పెంపొందించడం ద్వారా, తిరుమలకు వచ్చే యాత్రికులకు, భక్తులకు ఎంతగానో తోడ్పడుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి, తిరుమల వేరువేరు కాదని తిరుమల తిరుపతిలో అంతర్భాగమని ఆ కారణంగానే తమ సంఘం సంపూర్ణమైన మద్దతును తెలుపుతోందని ఆయన పేర్కొన్నారు.

## అశ్రునయనాలతో మహమ్మద్‌రఫీ అంతిమయాత్ర

మహమ్మద్ రఫీ అంత్యక్రియల్లో పాల్గొన్న పులివర్తి నాని

**ప్రజాశక్తి -రామచంద్రాపురం:** అశేష జనవాహిని, పోలీస్ బందోబస్తు నడుమ అశ్రునయనాల మధ్య టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు, అనుపల్లి పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ అంత్యక్రియలు బుధవారం రామచంద్రాపురం మండలం బొప్ప రాజు పల్లె లో నిర్వహించారు. ఉదయం గ్రామానికి 11 గంటలకు చేరుకున్న టిడిపి చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆయన భౌతిక దేహంపై పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించి కన్నీటి వీడ్కోలు పలికారు. స్వయంగా మహమ్మద్ రఫీ మృతదేహాన్ని మోసి అంతిమయాత్రతో విషాదంలో మునిగిపోయారు. మహమ్మద్ రఫీ భార్య నూర్జాన్ బీ, కుటుంబ సభ్యులను ఓదార్చి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మహమ్మద్ రఫీ అంతిమయాత్రకు వివిధ జిల్లాల నుండే కాకుండా మండలంలోని వేపకుప్పం నెత్త కుప్పం, ఎన్ఆర్ కమ్మపల్లి, సి రామాపురం, సొరకాయల పాలెం, రావిళ్ళవారిపల్లి, కమ్మ కండ్రిగ, వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, అభిమానులు తరలివచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

### ఆప్తుడుని కోల్పోయాం: పులివర్తి నాని

మొదట నుంచి టిడిపి అభివృద్ధికి, ప్రజా సేవకు మహమ్మద్ రఫీ జీవితం అంకితం చేశారని పులివర్తి నాని అన్నారు. పార్టీ పట్ల నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన అత్యంత ఆప్తుడు మహమ్మద్ రఫీని కోల్పోయామని ఆవేదన చెందారు. మహమ్మద్ రఫీ పిల్లలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రాబోవు అకడమిక్ ఇయర్ (విద్యా సంవత్సరం) ఉచిత విద్య అందిస్తామని పులివర్తి నాని అన్నారు. పార్టీ నుంచి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. వైసీపీ నేత అంబారపు ఖాదర్ వల్లి కుమారుడు అంబారపు సిద్దిక్ చేతిలో కర్ర దెబ్బకు హత్యకు గురైన టిడిపి మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ మృతి టిడిపికి తీరని లోటుని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, మండల టిడిపి నాయకులు మేకల తిరుమలరెడ్డి, జెడి జగన్, బొడ్డు సోము రాయల్, జయచంద్ర నాయుడు, వైస్ ఎంపీపీ కే మధుసూదన్ రెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి. పంతల వెంకటేష్ నాయుడు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవికుమార్, కే ధనంజయ రెడ్డి. కుప్పారెడ్డి, ప్రకాష్, కానాల ప్రసాద్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, కె.నరసింహారెడ్డి, కే గోపాల్ రెడ్డి, ఎద్దుల గుణసుందరి, మహమ్మద్ రఫీ మిత్ర బృందం, రాజకీయాలకు అతీతంగా భారీగా ప్రజలు పాల్గొన్నారు.

## 'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** బిఎన్ కండ్రిగ మండలం సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు ఆరని విద్యానాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతున్న కార్యక్రమమే జగనన్న సురక్ష అని, సచివాలయ అధికారులు వాలంటరీ వ్యవస్థ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలిసి ప్రజా సమస్యలు పరిష్కరిస్తుంటే జగనన్న ప్రోగ్రామ్ కు ప్రజలు జేజేలు పలుకుతున్నారని కొనియా డారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని వారి ఆరోగ్య సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో, వైద్య అధికారులు, ఎమ్మెల్‌వో ప్రసాద్, మండల సచివా లయాల కన్వీనర్ అందిన భాస్కర్ రెడ్డి, వైసిపి మండల నాయకులు జొన్నల గోపాల్ రెడ్డి, కేయం రాజా, ఆలతూరు ఎంపీటీసీ కొగిల వరలక్ష్మి, పుట్టేరి సచివాలయం కన్వీనర్స్ చిలుకూరు గిరి రెడ్డి, కొగిల రమేష్, ఆలగుంట చిన్ని కృష్ణ, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు అతివరం ధర్మయ్య, పీవీ కండ్రి పంచాయతీ సర్పంచ్ యనమల కోటమ్మ, పుట్టేరి సర్పంచి, మండల పార్టీ నాయకులు నలుబోలు నాగార్జున, వార్డ్ మెంబర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సత్యవేడు:** తిరుపతి జిల్లా సత్యవేడు మండలం సిరణంబూదూరు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుకు విశేష స్పందన లభించింది. మంగళవారం గ్రామసర్పంచ్ జానకి ఆనంద్ అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. సర్వే ద్వారా గుర్తించిన వ్యాధిగ్రస్తులు 533 మంది హాజరయ్యారు. జగనన్న సురక్ష క్యాంపులో 533 మంది పాల్గొనగా పురుషులు 203, మహిళలు 322 మంది, పిల్లలు 8 మంది ఉన్నట్లు సంబంధిత పంచాయతీ సెక్రెటరీ ప్రకాష్ పేర్కొన్నారు.47 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.


**తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి**

**టెండర్ నోటీసు నెం.05/డి.యమ్/2023-2024 తేది: 11.10.2023**

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి పరిధిలో గల తుమ్మలగుంట, కె.వి.యస్.స్పోర్ట్స్ పార్క్ నందు 23mm thick synthetic surface track పనికి అవసరమైన రేట్లు కొరకు ఉపాధ్యక్షులు వారు సీల్డు కొటేషన్స్ కోరుచున్నారు. దరఖాస్తుదారులు టెండరు ప్రకటన యొక్క పూర్తి వివరములకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తుడ, తిరుపతి వారిని సంప్రదించవలయును మరియు తుడ వెబ్‌సైట్ www.tudaap.in లో చూడగలరు.

సం/- యస్.హరికృష్ణ, యం.ఏ, యం.ఫిల్, ఉపాధ్యక్షులు, తుడా, తిరుపతి



IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No.437 of 2022
I.A.No.88 of 2021
O.S.No.08 of 2020

Between:
Smt Y.Usha Rani ...Petitioner/Plaintiff
And:
Smt Santhamma ...Respondent/Defendant

NOTICE TO THE RESPONDENTS

To
R4.G.VENU REDDY
S/o Late G.Nadhamuni Reddy,
Door No.12-4-369,
Bandla Veedhi, Tirupati Town
Chittoor District-AP 517501

Sir, While the pending disposal of the above suit,sole defendant namely Smt Santhamma died on 07-08-2021 leaving behind him,you and others as his legal representatives and you have succeeded to his entire estate and the petitioner filed a petition to implead your selfs as 4th defendant in the above suit and if you have got any objections you may appear before the court on **30-10-2023 at 10-30 a.m** either in person or through an advocate, the matter will be decided exparte

**Sd/-V.RAMANARAYANA REDDY**
Advocate for the Plaintiff
Chittoor, Date. 04-10-2023



IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No.436 of 2022
I.A.No.88 of 2021
O.S.No.08 of 2020

Between:
Smt Y.Usha Rani ...Petitioner/Plaintiff
And:
Smt Santhamma ...Respondent/Defendant

NOTICE TO THE RESPONDENTS

To
R4.G.VENU REDDY
S/o Late G.Nadhamuni Reddy,
Door No.12-4-369,
Bandla Veedhi, Tirupati Town
Chittoor District-AP 517501

Sir, While the pending disposal of the above suit,sole defendant namely Smt Santhamma died on 07-08-2021 leaving behind him,you and others as his legal representatives and you have succeeded to his entire estate and the petitioner filed a petition to implead your selfs as 4th defendant in the above suit and if you have got any objections you may appear before the court on **30-10-2023 at 10-30 a.m** either in person or through an advocate, the matter will be decided exparte

**Sd/-V.RAMANARAYANA REDDY**
Advocate for the Plaintiff
Chittoor, Date. 04-10-2023



IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI
I.A.No.1/2023
C.R.P.NO.4259/2015
N. B. Sudhakar Reddy ..Petitioner/Appellant
V/s
Tirumanyam Sumalatha ..Respondent

NOTICE TO RESPONDENT

Tirumanyam Sumalatha W/o M. Naveen Kumar Reddy R/o 10-13-549 Reddy & Reddy Colony, Tirupati, Chittoor district, Andhra Pradesh

Please take Notice that the above petition filed by the petitioner/ appellant under Section 20(1) C.P.C and is posted to 13-10-2023 for your appearance before the Honourable High Court of Andhra Pradesh, Amaravati at 10.30 a.m. either in person or through an advocate and file your objections. Otherwise your matter will be decided exparte.

**Date of hearing: 13-10-2023**
By order of court
**M/S INDUS LAW FIRM**
ADVOCATE [OPUC]